ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 24.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు
జిల్లా వార్తలు

సోమవారం 31 మార్చి 2025





వెండి శేషవాహనంపై ఉగాది మండపానికి వెళుతున్న శ్రీవారు, అమ్మవార్లు



ఉగాది మండపంలో స్వామి, అమ్మవార్లకు పూజలు



గజ సేవ, ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్ఛరణ

అన్నీ అనుకూల ఫలితాలే..

ఏలూరు సిటీ: జిల్లాలోని ఆలయాలతో పాటు పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు కూడా పంచాంగ శ్రవణ కార్యక్రమాలను ఏర్పాటుచేసి పండితులను సత్కరించారు. విశ్వావసు నామ సంవత్సర ఫలాలను పండితులు తెలియజేశారు. ఈ ఏడాది రాజు సూర్యుడు అని, మంత్రి చంద్రుడు కావడంతో అన్నింటా శుభాలు జరుగుతాయని పంచాంగకర్తలు పేర్కొన్నారు. పంటలు సంవృద్ధిగా పండుతాయని, వర్షాలతో పాడిపంటలు బాగుంటాయన్నారు. ఈ ఏడాది ప్రతి రాశి వారికి శుభాలే జరుగుతాయన్నారు. కొన్ని ఒడిదుడుకులు ఏర్పడినా క్రమేపీ సర్దుకుంటాయన్నారు.

ఉగాది ఉత్సవం

విశ్వావసు నామ సంవత్సరం సకల శుభకరం

- ఏలూరు గిరిజన భవన్‌లో అధికారిక కార్యక్రమం
- పంచాంగ శ్రవణం.. పండితులకు సత్కారం
- ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రం ఉగాది మండపంలో ప్రత్యేక పూజలు
- జిల్లాలోని ఆలయాల్లో భక్తుల రద్దీ

ఏలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఏలూరు గిరిజన భవన్‌లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికారులు సంప్రదాయ వస్త్రాలను ధరించి హాజరయ్యారు. పండితుల మంత్రోచ్చరణ నడుమ కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉగాది వేడుకలను ప్రారంభించారు. గండికోట రాజేష్ శిష్యబృందం, ఐటీడీఏ బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జరావల్లభుల సాయిరామ్ ఆధ్వర్యంలో ఇలింద్రపర్తి శ్రీనివాసరావు, డాక్టర్ విప్పర్తి ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, పట్టా సుదర్శనాచార్యుల కవి సమ్మేళనం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. సుదర్శన శ్రీనివాసాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఐటీడీఏ పీవో రాములు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు, సెట్వెల్ సీఈవో ప్రభాకర్, ఉద్యానశాఖ డీడీ ఎస్.రామ్మోహన్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా, డీఈవో పి.లక్ష్మమ్మ, ఐసీడీఎస్ పీడీ పి.శారద, జలవనరులశాఖ ఎస్ఈ పి.నాగార్జునరావు, సహాయ పర్యాటకశాఖ అధికారి పట్టాభి, డీపీఆర్వో ఆర్‌వీఎస్ రామచంద్రరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల, మార్చి30 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుపతి శ్రీవారి దివ్య క్షేత్రంలో స్వామివారికి ఉగాది ఉత్సవం ఆదివారం రాత్రి కడురమణీయంగా జరిగింది. గరుడాళ్వార్ కూడలిలోని ఉగాది మండపంలో ఆలయ అర్చకులు వైభవోపేతంగా వేడుక నిర్వహించారు. ఆలయంలో ఉభయదేవేరులు, గోదాదేవితో కలసిన శ్రీవారి ఉత్సవమూర్తులను సాయంత్రం వెండి శేషవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారం చేశారు. అనంతరం మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు. అర్చకులు, పండితుల వేదమంత్రోచ్చరణ నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారు కొలువుదీరిన వాహనం ఉగాది మండపం వద్దకు తరలివెళ్లింది.

అర్చకుల వేదమంత్రోచ్చరణ నడుమ శేషవాహనంపై అట్టహాసంగా మండపం వద్దకు చేరుకున్న స్వామి, అమ్మవార్లకు భక్తులు నీరాజనాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో రజిత సింహాసనంపై శ్రీవారిని ఉంచి అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ ఛైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు ఆధ్వర్యంలో ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి, ఈఈ భాస్కర్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించాశారు. పండితులు పంచాంగ శ్రవణం చేసి రాశి ఫలాలను చదివి భక్తులకు వినిపించారు. ఆ తర్వాత పండితులు, దాతలకు సత్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



ఉగాది ఉత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి



పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు
గ్రీన్ సిగ్నల్

- 296 మోడల్ ప్రాథమిక బడులకు ఓకే
- సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లు ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలు?

ఏలూరు అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ దాదాపు కొలిక్కివచ్చింది. జగన్ ప్రభుత్వ పాలనలో విధ్వంసానికి గురైనన ప్రాథమిక తరగతులను తిరిగి ఆయా పాఠశాలలకే చేర్చడంతో పాటు, క్లస్టర్లలోని పంచాయితీ యూనిట్‌గా అన్ని వసతులతో మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటుచేయడానికి జిల్లా విద్యాశాఖ సమాయత్తమవుతోంది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా ఏర్పాటుచేయ తలపెట్టిన ఐదు రకాల బడులకు సంబంధిత పాఠశాలల ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ)ల నుంచి ఆమోదం తీసుకున్న తర్వాతే వీటిని ప్రారంభిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 1609 ప్రభుత్వ పాఠశాలలుండగా 30 పాఠశాలల ఎస్ఎంసీలు తీర్మానాలు ఇచ్చేందుకు కొన్ని ప్రత్యామ్నాయాలను విద్యాశాఖ ముందుంచాయి. వాటిని కూడా ఒప్పించి ఐదు రకాల బడుల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో విద్యాధికారులు సన్నద్ధమవుతున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే నాటికి ఐదు రకాల బడులను సిద్ధంచేయడానికి చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కొత్తగా 296 మోడల్ ప్రైమరీ స్కూళ్లు

జిల్లాలోని 27 మండలాలను 111 క్లస్టర్లుగా విభజించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించేలా కొత్తగా 296 మోడల్ ప్రైమరీ స్కూళ్లను ప్రారంభించనున్నారు. తరగతుల విలీనానికి అవకాశంలేని, సహజ సిద్ధ అడ్డంకులున్న (జాతీయ రహదారులు, చెరువులు, కాల్వలు) ప్రస్తుత 1 నుంచి 5వ తరగతి బేసిక్‌ప్రైమరీ స్కూళ్లను అక్కడే కొనసాగిస్తారు. ఇక 1, 2 తరగతులతోపాటు పూర్వ ప్రాథమిక తరగతులతో కూడిన ఫౌండేషనల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటవుతాయి. జిల్లాలో బేసిక్ ప్రైమరీ, ఫౌండేషనల్ స్కూళ్లు 894 ప్రారంభిస్తారు. అదనంగా 207 హైస్కూళ్లు ఉంటాయి. కేవలం ఉన్నత పాఠశాలలు మినహా, మిగతా 4రకాల బడులలలో ప్రీప్రైమరీ - 1, 2 (ఎల్‌కేజీ, యూకేజీ) తరగతులుంటాయి. ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించే శాటిలైట్ పాఠశాలల సంఖ్యను మహిళా శిశు సంక్షేమశాఖ నిర్ణయిస్తుంది. ఇప్పటికే నిర్వహిస్తోన్న అంగన్‌వాడీ కేంద్రాలన్నీ శాటిలైట్ స్కూల్స్‌గా మారిపోతాయి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లోవున్న సుమారు 1.40 లక్షల మంది బాలబాలికలు కొత్తగా పునర్వ్యవస్థీకరణ అనంతరం ఏర్పాటయ్యే ఐదురకాల బడుల్లో ఉంటారనేది విద్యాధికారుల అంచనా.

సర్‌ప్లస్ టీచర్ల సర్దుబాటు

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ అనంతరం ప్రభుత్వ మార్గదర్శకాలమేరకు ఉపాధ్యాయుల అవసరత, కొరతను తేల్చనున్నారు. ఇంతకుముందు సేకరించిన గణాంకాల ప్రకారం పాఠశాల విద్య పరిధిలో ఏర్పాటయ్యే 4రకాల బడులకు ఎస్జీటీ కేడర్ టీచర్లు 3,322 మంది, స్కూల్ అసిస్టెంట్‌కేడర్ ఉపాధ్యాయులు 2,996 మంది అవసరమవుతారని గుర్తించారు. అవసరానికి మించి మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయుల్లో 35మంది ఎస్జీటీలు, 431మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారని నిర్ధారణకు వచ్చారు. సవరించిన పునర్వ్యవస్థీకరణ డేటాప్రకారం టీచర్ల అవసరత, సర్‌ప్లస్ గణాంకాల్లో కొద్దిపాటి మార్పులు ఉండవచ్చు. సర్‌ప్లస్ స్కూల్‌అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్‌ఎంలుగా నియమించి, ఎస్జీటీలను డీఈవో పూల్‌లో ఉంచేలా నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. దీనిపై అధికారిక నిర్ణయం వెలువడలేదు.

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఖనిజ సంపద అక్రమంగా తరలిపోతోంది. మైనింగ్ శాఖ జిల్లా అధికారుల తనిఖీలు అంతంతమాత్రం కావడంతో అక్రమార్కులు గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఎర్ర మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఇళ్లకు మెరక పేరిట గ్రావెల్‌ను అందిన కాడికి తవ్వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అక్రమార్కులకు అడ్డుకునే వారే కరువయ్యారు.



మేదినరావుపాలెం వద్ద తవ్వేసిన పోలవరం కుడి కాల్వ గట్టు

ఖజానాకు గండి

- జిల్లాలో గనుల ఆదాయం లక్ష్యం రూ.143.11 కోట్లు
- వసూలైంది రూ.110 కోట్లు
- పర్యవేక్షణలేమి.. రూ.30 కోట్ల వెనుకంజ
- అక్రమార్కులకు అధికారుల అండ!

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

క్వారీ నిర్వహణకు మైనింగ్‌శాఖ, పర్యావరణ శాఖ(ఈసీ), కాలుష్య నియంత్రణ మండలితో పాటు సీఎఫ్ఈ, సీఎఫ్‌వో అనుమతులు తీసుకోవాలి. రవాణాకు సంబంధించిన పర్మిట్లు తీసుకుని తవ్విన ఖనిజం తరలించుకోవాలి. అవేమి లేకుండా దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో పలు గ్రామాల్లో కొందరు పొలాల్లో 15 అడుగుల లోతుకు ఎక్స్‌వేటర్లతో తవ్వి రెండు జిల్లాలకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చింతలపూడి, నూజివీడు, చాట్రాయి, కొయ్యలగూడెం, టి.నరసా నరసాపురంలో యథేచ్ఛగా అక్రమ క్వారీయింగ్ జరుగుతోంది. ఇసుక రీచ్‌ల ఏర్పాట్లతో అధికారులు క్యాంపులకు వెళ్లిపోవడంతో నిఘా కొరవడింది. కిందిస్థాయిలో క్వారీల్లో అక్రమాలకు బడాబాబులు తెరతీస్తున్నారు. ఇప్పుడు వేసవి సీజన్‌లో ఇళ్ల నిర్మాణాలకు గ్రావెల్, ఇతర మెటల్స్ అవసరాలకు డిమాండ్ ఉంది.

సొంత లాభం కోసం..


వైసీపీ ప్రభుత్వంలో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారు. ఇప్పుడు కూడా అదే వ్యవహార శైలితో సొంత లాభం చూసుకోవడంతో ప్రభుత్వాదాయానికి గండి పడుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కిందిస్థాయిలో సిబ్బంది కొందరు అధికారులకు మామూళ్లు ఎర చూపించి క్షేత్రస్థాయికి వెళ్లనీయకుండా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఖనిజాన్ని బట్టి క్యూబిక్ మీటరుకు రూ.100 నుంచి రూ.220 వరకు రాయల్టీ చెల్లించాల్సి ఉంది. అక్రమ మైనింగ్‌తో ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరడం లేదు. ఈ ఏడాది మైనింగ్ శాఖ ద్వారా జిల్లాలో రూ.143.11 కోట్లు ఆదాయం లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం రూ.110.13 కోట్లే లభించింది. ఇక రూ.30 కోట్ల పైమాటే వసూళ్లు కావాల్సి ఉంది. ఇదీ వసూలు కావడం అనుమానమే. దీనికి ప్రధాన కారణం అక్రమాల నిరోధం పేరిట ప్రభుత్వం కొద్దికాలం పర్మిట్లు నిలిపివేయగా, ఇతర మైన్ల నుంచి అధికారులు రాయల్టీని వసూలు చేయడంలో చేతివాటం చూపారని ప్రచారం జరుగుతోంది. జిల్లాలో ద్వారకా తిరుమలలో బాల్ క్లే, కొయ్యలగూడెం, చింతలపూడి, చాట్రాయి మండలాల్లో రోడ్డు మెటల్, భీమడోలు, ఉంగుటూరు, టి.నరసాపురం, చాట్రాయి, ముసునూరులో గ్రావెల్ క్వారీలు ఉన్నాయి. ఇవే ప్రధాన ఆదాయ వనరులుగా గనులశాఖ చూపిస్తోంది. మిగిలిన మండలాల్లో గనులను పర్యవేక్షించకుండా గాలికొదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక అధికారి కొద్ది నెలల్లో ఉద్యోగ విరమణ చేయనుండడంతో అక్రమ క్వారీయింగ్‌ను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కీలకమైన రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డిప్యుటేషన్‌పై విజయవాడ డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. ఈ పోస్టులో కాంట్రాక్టు పద్ధతిలో రిటైర్డు ఉద్యోగితో పనులు చేయిస్తున్నారు. ఈ విషయాలపై గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరని సిబ్బంది చెబుతున్నారు.

పరిహారం ఎదురు-చూపు

కుక్కునూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈ నెల 27న పోలవరం పర్యటనలో భాగంగా కుక్కునూరు మండల నాయకులు, నిర్వాసితులు తమ సమస్యలను విన్నవించారు. సమస్యలు విన్న అనంతరం అర్హత ఉన్న ప్రతీఒక్కరికి పరిహారం అందిస్తానని, కొన్నేళ్లుగా మూతపడిన వెబ్ ల్యాండ్ తిరిగి ఓపెన్ చేయిస్తానని హామీ ఇచ్చారు. దీనితో నిర్వాసితుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

2017లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నిర్వాసితులు గుర్తించడానికి ప్రైమరీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం సర్వే చేసి జాబితాను విడుదల చేశారు. ఆధార్, రేషన్‌కార్డు, ఓటుకార్డు, ఉపాధి హామీ కార్డులున్నప్పటికి స్థానికంగా ఉండడం లేదనే నెపంతో వందలాది మంది నిర్వాసితులకు పునరావాస జాబితాలో చోటు కల్పించలేదు. దీనిపై అప్పటి నుంచి తమకు న్యాయం చేయాలంటూ నిర్వాసితులంతా ఎనిమిదేళ్లుగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల చుట్టూ జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయారు. నిర్వాసితులను గుర్తించడానికి ఎన్నోసార్లు గ్రామసభలు నిర్వహించినా న్యాయం జరగలేదు. చివరకు తమకు అన్ని ఆధారాలు ఉన పునరావాస జాబితాలో చోటు కల్పించలేదని కోర్టుకు వెళ్లారు.

సీఎం హామీతో నిర్వాసితుల్లో ఆశ



- స్థానికంగా లేరని పరిహారం ఇవ్వలేదు
- జాబితాలో పేర్లు లేవు
- సీఎం పర్యటనతో చిగురించిన ఆశలు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస పరిహారం అర్హతకు సంబంధించి అన్ని ఆధారాలు ఉంటే వారికి తప్పకుండా న్యాయం చేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు.

ఇటీవల కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 25 గ్రామాలకు సంబంధించి పునరావాస పరిహారం చెల్లించారు. అన్ని ఆధారాలు ఉన్న నిర్వాసితులకు న్యాయం జరగక పరిహారం అందని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల నుంచి ఏనాడు బయట ప్రాంతాలకు వెళ్లని పలువురిని జాబితాలో చేర్చకపోవడంతో పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలోనే పోలవరం పర్యటనకు వచ్చిన సీఎం అన్ని అర్హతలు ఉంటే కచ్చితంగా పరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో పెండింగ్ జాబితాలో ఉన్న నిర్వాసితుల్లో ఆశలు రేగాయి.

వెబ్‌ల్యాండ్ కష్టాలు

పోలవరం ముంపులో ఉన్న భూములు తీసుకుని ప్రభుత్వం పరిహారం చెల్లించింది. అనంతరం వెబ్ ల్యాండ్ మూసివేయడంతో రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నారు. ముంపులేని ప్రాంతాలు దాదాపు 5వేల ఎకరాలు ఇంకా మిగులుభూమి ఉంది. వెబ్ ల్యాండ్ మూసివేయడంతో రైతులకు ప్రభుత్వం సంబంధించి ఎటువంటి పథకాలు అందడంలేదు. క్రయవిక్రయాలు జరగడం లేదు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లగా వెబ్‌ల్యాడ్ ఓపెన్ చేయిస్తానని హామీ ఇచ్చారు.



ఏనాడూ గ్రామం విడిచి వెళ్లలేదు

నేను పుట్టినప్పటి నుంచి ఏనాడు గ్రామం విడిచి వెళ్లలేదు. నా పేరు పునరావాస పరిహార జాబితాలో లేదు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయాను. చేసేదిలేక చివరికి న్యాయం కోసం కోర్టుకు వెళ్లాను.

కాకులమారి సుధాకర్, కుక్కునూరు ఎ.బ్లాక్



సీఎం హామీతో నమ్మకం వచ్చింది

నేను చేతివృత్తి పని చేసుకుంటాను. నా పేరు జాబితాలో లేదు. ఎన్నోసార్లు అధికారులు విచారణ చేశారు. కానీ నాకు న్యాయం జరగలేదు. ఇప్పుడు సీఎం ఇచ్చిన హామీతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం వచ్చింది.

సుబ్బయ్య, కుక్కునూరు, ఎ.బ్లాక్

నేడు రంజాన్

ఏలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు సోమవారం రంజాన్ జరుపుకోనున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముగిస్తారు. జిల్లాలోని ముస్లింలకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ అన్నారు. ముస్లిం రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

ఏలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో పీజీఆర్ఎస్ కార్యక్రమం లేదని, ప్రజలు గమనించాలన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

ఎల్-1 స్కానర్లతో వేలి ముద్ర కష్టాలకు చెక్



ఏలూరు రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఎటువంటి అవకతవకలు, ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆధునికరించిన ఎల్-1 స్కానర్లను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అందజేసింది. వాటి సాయంతో ఏప్రిల్ 1 నుంచి త్వరగా పింఛన్ సొమ్ము పంపిణీ చేయడానికి వెసులుబాటు కలుగుతుంది. కొత్త స్కానర్ల వినియోగంపై అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. వాస్తవంగా వివిధ రకాల సామాజిక పింఛన్ల పంపిణీ సర్వే నిర్వహించేటప్పుడు లబ్ధిదారుల వేలిముద్ర నమోదుకు సచివాలయ సిబ్బందికి ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌జి స్కానర్లు పనిచేయడంలేదు. వేలిముద్రలు సరిగ్గా పడక లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో కేంద్రం సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం ఎల్-1 ఆర్‌డి పరికరాలను కొనుగోలు చేసి గ్రామ, వార్డు సచివాలయాలకు సరఫరా చేసింది. ఈనెల 31 నుంచి పాత స్కానర్లు పనిచేయవు. కొత్తగా సరఫరా చేసిన ఎల్-1 ఆర్‌డి స్కానర్లతోనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, పి-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్ షిప్), వర్క్‌ఫ్రం హోం, హౌస్ హోల్డ్, జియోటాగింగ్, పీజీఆర్ఎస్‌పీడీ బ్యాక్, తదితర సర్వేలకు వినియోగించనున్నారు. ఎక్కడైనా స్కానర్లు పనిచేయకుంటే వాటి స్థానంలో కొత్తవి ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. యూఐడీఏఐ ఆధార్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం చేశారు. ప్రతీనెలా ప్రభుత్వం అందించే పింఛన్లు ఏప్రిల్ 1న ఎల్-1 ఆర్‌డి స్కానర్ల సాయంతో పంపిణీ చేయనున్నారు.

ఏలూరు జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

ఇద్దరు మహిళా ఉద్యోగుల సస్పెన్షన్

విచారణ చేపట్టిన ఏలూరు ఆర్డీవో

7

ఏలూరులో హంతకుడి అరెస్టు

చీటీల ఆర్థిక లావాదేవీలతో వృద్ధురాలి హత్య

ఉగాది పురస్కారాలు

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వావసు నామ సంవత్సర వేడుకలను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రంగాలలో అత్యుత్తమ కృషి చేసిన కళాకారులకు కళారత్న, ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన పలువురికి సీఎం చంద్రబాబు నాయుడు పురస్కారాలు అందజేసి సత్కరించారు. పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.






ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారాలు అందుకుంటున్న ఇంద్రజాలికుడు డాక్టర్ బోస్(భీమవరం) శిల్పి శ్రీనివాస ఉడయార్ (తాడేపల్లిగూడెం) పద్య కవి, రచయిత రసరాజు (తణుకు) తెన్నేటి మాస్టారు (పాలకోడేరు)





ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఏలూరు గిరిజన భవన్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉగాది వేడుకలను ప్రారంభించారు. భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



చిన్నారులతో కలెక్టర్ వెట్రిసెల్వి






భీమవరంలో జరిగిన ఉగాది వేడుకల్లో భాగంగా నృత్య కళాకారులతో కలెక్టర్ నాగరాణి సెల్ఫీ



ఏలూరులో జరిగిన వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు..



ఉమ్మడి పశ్చిమ గోదావరి పశు సంవర్ధక శాఖ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏలూరులో నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ డాక్టర్ టి.గోవిందరాజు ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ అనిత సమక్షంలో ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా భీమడోలు ఏడీ డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్, ఉపాధ్యక్షుడిగా జంగారెడ్డిగూడెం ఏవీహెచ్ డాక్టర్ దొరను ఎంపిక చేశారు. సహాయ కార్యదర్శిగా భీమవరం ఏవీహెచ్ డాక్టర్ సుధీర్, కోశాధికారిగా కొవ్వూరు ఏవీహెచ్ డాక్టర్ ఎ.వెంకటరెడ్డి,జాయింట్ కార్యదర్శిగా డాక్టర్ ప్రమీలారాణిని ఎంపిక చేశారు. జిల్లా పోలింగ్ ఆఫీసర్‌గా డాక్టర్ రూపకళ (ఏడీ) వ్యవహరించారు.

నిప్పుల గుండం



పాలకోడేరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పాలకోడేరు మండలం విస్సాకోడేరులో ఉగాది పురస్కరించుకుని గ్రామ దేవతలు వనువలమ్మ, మహంకాళి అమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిప్పుల గుండం నిర్వహించారు. సుమారు 300 మంది భక్తులు నిప్పులగుండం తొక్కారు.




వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

తణుకు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తణుకులో శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది. పట్టణంలోని నూలి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఉత్సవ విగ్రహాలతో శ్రీనివాసుని కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఉగాది పురస్కరించుకుని డాక్టర్ శంకర్ శర్మ పంచాగం శ్రవణం చేశారు. ఎస్ఎన్‌వీటీ కళాశాల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన ఉత్సవ విగ్రహాలను ఎమ్మెల్యే రాధాకృష, కృష్ణతులసీ దంపతులు వేదిక వద్దకు తీసుకొచ్చారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. పద్మజ నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో శ్రీనివాస వైభవం నృత్య రూపకం ఆలరించింది. లావణ్య బృందం కీర్తనలు ఆకట్టుకున్నాయి. అంబికా డాన్స్ అకాడమీ విద్యార్థుల వినరో భాగ్యము విష్ణుకథ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



కల్యాణం తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి దంపతులు



శ్రీనివాస వైభవం నృత్య రూపకం



చిన వెంకన్న ఆలయంలో ఉగాది పచ్చడి తీసుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కరించుకుని ద్వారకా తిరుమల చినవెంకన్న క్షేత్రం భక్తులతో కళకళలాడింది. ఆదివారం ఉదయం నుంచి భక్తుల రాకతో అన్ని విభాగాలు సందడిగా మారాయి. ఆలయానికి వచ్చిన వారికి దేవస్థానం తీర్థవినియోగ ప్రాంతంలో ఉగాది పచ్చడి అందించింది.

కుంకుళ్లమ్మకు ఐదు లక్షల గాజులతో అలంకరణ



క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్స వాలు ఆదివారం కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఐదులక్షల గాజులతో అలంకరించారు. వచ్చేనెల 7 వరకూ జరుగనున్న ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారు గాజుల అలంకరణలో నిండు ముత్తైదు వులా భక్తులకు దర్శనమీయనున్నారు. వచ్చేనెల 7న ఆలయ ఆవరణలో కుంకుమపూజ తర్వాత చండీహోమం జరుగుతుందని ఆలయ అర్చకులు పుసులూరి భైరవస్వామి తెలిపారు.



మృతిచెందిన నాగేశ్వరరావు.. చికిత్స పొందుతున్న భార్య, పిల్లలు

ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరి మృతి

భార్య , పిల్లలకు గాయాలు

కొయ్యలగూడెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కొయ్యలగూడెం మండలం సీతంపేట సమీ పంలో ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో జంగారెడ్డిగూడెం లక్కవరం గ్రామానికి చెందిన వీర నాగేశ్వరరావు (45) మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నాగేశ్వరరావు లక్కవరంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆదివారం నాగేశ్వరరావు అతని భార్య రమణమ్మ, కుమార్తె జాహ్నవి, కుమారుడు షణ్ముఖ్ రెడ్డి నలుగురూ తమ ద్విచక్ర వాహనంపై లక్కవరం నుంచి రాజమండ్రి బంధువుల ఇంటికి బయలుదేరారు. కొయ్యలగూడెం మండలం సీతంపేట సమీపానికి చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడ్డ వీరిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందాడు. భార్య, పిల్లలను మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. మృతుడి కుమార్తె జాహ్నవి రాజమండ్రిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుండగా, కుమారుడు షణ్ముఖ్ రెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

అదుపు తప్పిన వ్యాను



భీమవరం క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఒక వ్యాను అదుపు తప్పింది. భీమవరం వైపు నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న రొయ్యల వ్యాను వేగంగా వెళ్తూ అదుపు తప్పి పక్కనే ఉన్న బోదెలోకి దూసుకువెళ్లింది. అక్కడ సివిల్ సప్లయిస్ గొడౌన్‌కు సంబంధించిన ప్రహరీ గోడ ఉండటంతో ఆ గోడను తాకి ఆగింది.



పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు...విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

చీటీల ఆర్థిక లావాదేవీలే కారణం

వృద్ధురాలిని హతమార్చిన హంతకుడి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలిని అతి కిరాతకంగా హతమార్చి, పెట్రోలు పోసి దగ్ధం చేసిన హంతకుడిని అరెస్టు చేసినట్టు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాల యంలో ఆదివారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఏలూరు వెన్నవల్లిపేటకు చెందిన చనపతి రమణమ్మ (68) చీటీల వ్యాపారం చేస్తూంటుంది. 22 ఏళ్ళ క్రితం ఆమె భర్త మరణించాడు. ఆమెకు ఒక కుమార్తె ఉండగా సమీపంలో ఉంటున్నది. ఒంటరిగా జీవిస్తున్న రమణమ్మ వద్ద ఏలూరు సత్యనారాయణపేటకు చెందిన దూరపు బంధువు చనపతి దుర్గాప్రసాద్ (25) రెండు లక్షల రూపాయల చీటీ వేసి సొమ్ము తీసుకున్నాడు. వాయిదాల సొమ్ము 20 వేలు చెల్లించాల్సి ఉంది. రమణమ్మ అతని ఇంటికి పలుమార్లు వెళ్లి సొమ్ముకోసం అతనిని, అతని తల్లిని దుర్భాషలాడి అవమానపరిచింది. దీంతో రమణమ్మపై పగ పెంచుకున్న దుర్గాప్రసాద్ ఆమెను హతమార్చాలనుకున్నాడు. ఆమెకు సొమ్ములు ఇస్తానని చెప్పి ఈనెల 27వ తేదీ రాత్రి 9.30 గంటలకు ఆమె ఇంటికి వెళ్ళాడు. తనతో తెచ్చుకున్న నైలాన్‌తో మెడ బిగించి హతమార్చాడు. నోట్లో కాటన్ చీర కుక్కేశాడు. కాళ్ళు, చేతులకు తాళ్ళు కట్టేసి ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసు, చెవి దిద్దులు, మాటీలు, రెండు వేల రూపాయల నగదు అపహరించి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో రెండు కూల్ డ్రింక్ బాటిల్స్‌లో పెట్రోల్ పోయించుకుని సుమారు 2.30 గంటల సమయంలో రమణమ్మ ఇంట్లోకి వెళ్లి ఆమెపై, మంచంపై, టీవీ, ఏసీపై పెట్రోలు పోసి అంటించి పారిపోయాడు. ఇంటి నుంచి పొగలు రావడంతో ఇంటి ఎదురుగా ఉన్న యువకుడు బయటకు వచ్చి చూసి అల్లుడికి సమాచారం ఇచ్చాడు. ఈ సంఘటనపై క్లూస్ టీమ్‌లను, మంగళగిరి నుంచి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, భీమడోలు సీఐ విల్సన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బోణం ఆది ప్రసాద్, ఎస్ఐలు నాగబాబు,షేక్ మదీనా బాషా సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం 11 గంటలకు పంపుల చెరువు వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న చనపతి దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని నుంచి బంగారు ఆభరణాలు, మోటారు సైకిల్, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఏలూరు జైలులో మహిళా రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

ఇద్దరు మహిళా ఉద్యోగుల సస్పెన్షన్

విచారణ చేపట్టిన ఏలూరు ఆర్డీవో



శాంతకుమారి (ఫైల్ ఫొటో)



ఏలూరులో జిల్లా జైలు



మృతురాలి తల్లి, బంధువులతో మాట్లాడుతున్న ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

ఏలూరు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడితో కలిసి భర్తను హత్య చేశారనే ఆరోపణపై అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా జిల్లా జైలులో ఉన్న ఒక మహిళ తాను ఉన్న బ్యారెక్ కిటికీకి చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ సంఘటన జిల్లా కేంద్రమైన ఏలూరులో తీవ్ర కలకలం కలిగించింది. పోలీసులు, మృతు రాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలం తాటి ఆకులగూడేనికి చెందిన గంధం శాంతకుమారి (31)కి భర్త బోసు, కుమార్తె ఆరాధ్య (10), కుమారుడు అనూప్ శక్తి అలియాస్ చర్రీ (12) ఉన్నారు. శాంతకుమారి తన ప్రియుడు సొంగా గోపాలరావుతో కలిసి భర్తను హతమార్చారనే ఆరోప ణపై మార్చి 24వ తేదీన అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా ఏలూరు జిల్లా జైలులో ఉంటున్నది. మహిళా బ్యారక్‌లో ఉంటున్న శాంతకుమారి ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో అందరూ టిఫిన్ చేయడానికి బయటకు వచ్చారు. బయటకు వచ్చిన శాంతకుమారి తిరిగి వాష్‌రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి బ్యారక్ వద్దకు వెళ్లిపో యింది. అక్కడ ఉన్న డ్యూటీ మహిళా కానిస్టేబుల్ 7.50 నిముషాలకు వెళ్ళి చూసేటప్పటికి బ్యారక్ కిటికీకి తన చున్నీతో ఉరి వేసుకుని వేలాడబడుతూ కనిపించింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్ప టికే ఆమె మృతి చెందిందని వైద్యులు ధృవీ కరించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జైలు సూపరింటెండెంట్ స్వామి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఈ సంఘటనపై ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్య నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఏలూరు తహసీల్దార్ శేషగిరి జిల్లా జైలును పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రి వద్దకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి, బంధువులతో ఆర్డీవో మాట్లాడారు. సోమవారం ఉదయం శాంత కుమారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

హెడ్ వార్డర్, వార్డర్ సస్పెన్షన్

జిల్లా జైలులో విధి నిర్వహణలో ఉన్న హెడ్‌వార్డర్ ఎల్.వరలక్ష్మి, వార్డర్ నాగమణిలు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడంతోనే రిమాండ్ ఖైదీ శాంతకుమారి ఉరి వేసుకోవడానికి ఆస్కారం ఏర్పడిందని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిద్దరిని విధుల్లో నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లలకు న్యాయం చేయండి

మృతురాలి తల్లి వేడుకోలు

తన అల్లుడు బోసు, కుమార్తె శాంతకుమారి చిన్నచిన్న గొడవలు పడేవారని తన కూతురు అమాయకురాలని తన అల్లుడిని చంపేంత ధైర్యం తన కుమార్తెకు లేదని అన్యాయంగా కేసులో ఇరికించారన్నారు.తన కుమార్తెకు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారిద్దరికి న్యాయం చేయాలని ఆమె కోరారు. శాంతకుమారిని అక్రమంగా కేసులో ఇరికించారని జీలుగుమిల్లి పోలీసుల వేధింపుల భరించలేక ఆమె అవమానపడి ఆత్మహత్యకు పాల్పడిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు కందుల రమేష్ అన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు..నలుగురికి గాయాలు



ఏలూరు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో అతి వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఆ కారులో ఉన్న నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. హైదరాబాద్‌నకు చెందిన సాయి కృష్ణ, ఆయన భార్య అనూష, కుమారుడు విరాజ్‌కృష్ణ, ఆయన తండ్రి వెంకట్రావు, తల్లి కలిసి సొంత కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన అమలాపురం సమీ పంలోని ములకాలగడ్డకు వస్తున్నారు. ఆదివారం ఉదయం ఏలూరు మెయిన్ బైపాస్‌లో కారు వెళ్తుండగా ముందు వెళ్తున్న ప్రైవేటు బస్సును తప్పించబోయి కుడివైపుకు వెళ్ళి డివైడర్‌ను ఢీకొని ఎదురు రోడ్డును కూడా దాటి సర్వీసు రోడ్డులోకి కారు వెళ్లిపోయింది. కారులో ఉన్న నలుగురు తీవ్ర గాయాలకు గురికాగా, అనూష పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు సూచించడంతో ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




గాయాలకు గురైన బాలుడు, మహిళ

ఎమ్మెల్యే ధర్మరాజును కలిసిన జ్యోతి దంపతులు

ఉంగుటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా నియామకమైన కారేటి జ్యోతి, అయ్యప్ప దంపతులు ఆదివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు దంపతులిద్దరూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి చిత్త శుద్ధితో పని చేసి వన్నె తేవాలని జ్యోతికి సూచించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి

జీలుగుమిల్లి/పోలవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని గ్రేస్ మందిర్ వ్యవస్థాపకులు రేవా బి.ఎజ్రాశాస్త్రి డిమాండ్ చేశారు. జీలుగుమిల్లిలో ఆదివారం పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పోలవరంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద పాస్టర్ ప్రవీణ్ మృతికి పాస్టర్ల సంఘం ఆదివారం నివాళులర్పించింది. అనంతరం ఏటిగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు.

ముస్లింలకు ఎమ్మెల్యే చింతమనేని రంజాన్ కానుక

పెదవేగి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముస్లింలకు రంజాన్ కానుక అందించనున్నారు. నియోజకవర్గంలోని ముస్లింలందరికీ మేక మాంసం, పాలు అందించేందుకు సర్వం సిద్ధం చేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం ఉదయం నియోజకవర్గంలోని సుమారు 5వేల మంది ముస్లింలకు 1.2 టన్నులకుపైగా మేక మాంసాన్ని పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం పెదవేగి మండలం రాయన్నపాలేనికి చెందిన ముస్లింలు దుగ్గిరాల కార్యాలయంలో ప్రభాకర్‌ను కలిసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ శుభాకాంక్షలు చెప్పిన ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అందరు ముస్లింలకు ప్రతి ఏడాది అందిస్తున్నట్టుగానే ఈ ఏడాది కూడా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.

కొవ్వలిలో వైభవంగా అంకమ్మ జాతర

దెందులూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : కొవ్వలిలో చల్లని తల్లిగా ఆపద మొక్కుల తల్లిగా పేరు పొందిన గోవాడ గ్రామ దేవత గోవాడ అంకమ్మ తల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి జాతరను ఉత్సవ కమిటీ చైర్మన్ గోవాడ నాగరాజు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని అంకమ్మ తల్లి జాతరను పుర వీధుల్లో నిర్వహించారు. అనంతరం 16 చెరువుల్లో అమ్మవారికి జలభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అంకమ్మను దర్శించుకున్నారు. 2న భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు జాతర కమిటీ తెలిపింది.

ఘనంగా కోండ్రుకోట దుర్గమ్మ జాతర

పోలవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : ఎల్.ఎం.డిపేట గ్రామ సమీపంలో ఉన్న కోండ్రుకోట పునరావాస కాలనీలోని కనకదుర్గమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలో నిర్మించిన పోతురాజు విగ్రహం వద్ద , కనక దుర్గమ్మ ఆలయం వద్ద కోండ్రుకోట పంచాయతీ పరిధి గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్, మురళీకృష్ణ, పూనెం సత్యన్నారాయణదొర, గ్రామ పెద్దలు బొత్త ముక్కయ్య, మూలెం గంగరాజు, తామారాజు, రాచ అబ్బులు రెడ్డి పాల్గొన్నారు.

ఆడమిల్లిలో తిరుకల్యాణ మహోత్సవం


పట్టు వస్త్రాల పంపిణీ దృశ్యం

కామవరపుకోట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఆడమిల్లిలోని శ్రీకంచి కామాక్షి ఏకాం బరేశ్వర స్వామి ఆలయం వద్ద స్వామివారి 67వ వార్షిక తిరుకల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు దంపతులు స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సంద ర్భంగా కమిటీ సభ్యులు భక్తులకు మహా అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో గ్రామస్తులే కాకుండా దూర ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి కళ్యాణాన్ని తిలకించి అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు భక్తులకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలు ఏప్రిల్ 3వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. అదే విధంగా ఉగాదిని పురస్కరించుకుని లలితాపీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రైవేటు వైద్యులు మేడూరి సత్యంబాబు దంపతులను సత్కరించారు.

'క్షత్రియ సేవా సమితి సేవలు అభినందనీయం'


కనకరాజు సూరిని సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం,మార్చి 30(ఆంధ్రజ్యోతి) : అప్ ల్యాండ్ క్షత్రియ సేవా సమితి సేవలు అభినందనీయమని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న సూర్యనారాయణ రాజు(కనకరాజు సూరి) అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలోని పిరమిడ్ వద్ద అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి ప్రధాన కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు, ఆర్థిక కార్యదర్శి గొట్టుముక్కల భాస్కరరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం వేదపండితులతో పంచాంగ శ్రవణం నిర్వహించారు. క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను ఆ సంఘ అధ్యక్షుడు పి.రంగరాజు వివరించారు. అనంతరం వేగేశ్న సూర్యనారాయణ రాజు, డైరెక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.సత్యనారాయణ రాజు, జి.రాము వర్మ, పి.జగపతిరాజు, సోమరాజు, డి.ధనరాజు పాల్గొన్నారు.

విర్డ్‌లో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల, మార్చి30 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా తిరుమల శివారులోని విర్డ్ ఆసుపత్రిలో ఆదివారం చైర్మన్ రాజా ఎస్.వి.సుధాకరరావు అధ్యక్షతన ట్రస్టుబోర్డు సమావేశం జరిగింది. ఇందులో దేవస్థానం ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తితో పాటు ట్రస్టీలు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తి, ఎంఎం గుప్తా, కె.వంశీ పాల్గొని ఆసుపత్రిలో రోగులకు అందే సౌకర్యాలపై చర్చించారు. నూతన ట్రస్టీలుగా ఎస్.వి.నివృతరావు, డాక్టర్ భవ్యచంద్‌లను నియమించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో 15 మంది దివ్యాంగులకు గుప్తా ఫౌండేషన్ చైర్మన్ గుప్తా సహకారంతో తయారైన కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారీ, పి.వి.నాగేంద్రబాబు, సింధు, గాయత్రి పాల్గొన్నారు.

ఘనంగా పాటిమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు


దెందులూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : చల్లచింతలపూడి- పెరుగుగూడెం గ్రామాల మధ్య వెలసిన గ్రామ దేవత యలమర్తి వారి ఆడపడుచు శ్రీ పాటిమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దేవస్థానం చైర్మన్ యలమర్తి శ్రీను, మాజీ సర్పంచ్ హేమలత దంపతులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెరుగుగూడెంలోని పావులూరు దశరథ రామయ్య నివాసం నుంచి పాటిమ్మ తల్లికి పుట్టింటి సారే, 108 కలశాలతో యలమర్తి వారి పుట్టింటి నూతన వస్త్రాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సోమవారం సమర్పించనున్నారని దేవస్థానం చైర్మన్ తెలిపారు.

బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం దోహదం


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్.ఐ

టి.నర్సాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. లూయిస్ డాగురే బస్‌షెల్టర్ వద్ద ఫొటో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. మొదటి రోజు మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. జయబాబు మాట్లాడుతూ యూనియన్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్ యూనియన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సెక్రటరీ చందు, వైస్ ప్రెసిడెంట్ మహరాజ్, కోశాధికారి వాసు, సభ్యులు రామారావు, ధర్మారావు, రాజు పాల్గొన్నారు.

విశిష్ట సేవలందించిన ప్రముఖులకు సత్కారం


శిల్పి అమ్మనరాజాను సత్కరిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల, మార్చి30 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ద్వారకా తిరుమలకు చెందిన శిల్పి ఆకుల అమ్మన రాజా, ఐ.ఎస్.జగన్నాథపురానికి చెందిన ఎస్.కె.నాజర్ వల్లిలను ఆదివారం రాజమహేంద్రవరంలోని ఓ పంక్షన్ హాల్లో ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజులు ఘనంగా సత్కరించారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో 110 మందిని సత్కరించగా అందులో వీరు ఉన్నారు.


పంచాంగం వివరిస్తున్న పుండరీకాక్షయ్య శర్మ, ఏలూరు ఏఎస్సార్ స్టేడియంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి, జీలుగుమిల్లిలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు, శ్రీరామ్‌నగర్‌లో తపనా చౌదరి పూజలు

ఘనంగా ఉగాది వేడుకలు


నిడమర్రులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఏలూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : మండవల్లి మల్లేశ్వర స్వామి అర్చకులు గూడూరు శ్రీనివాసరావు, ఏలూరు కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానందం, ముసునూరు వేంకటాచల స్వామి దేవస్థానం అర్చకులు వేదాంతం లక్ష్మీ నరసింహాచార్యులు, పెద్దింటి అమ్మవారి దేవస్థానం సప్త శతీ పారాయణదారు వెంకట నాగ శ్రీధర్ శాస్త్రిని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నగదు పురస్కారాలతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఘనంగా సత్కరించారు. అలాగే గిరిజన భవన్‌లో జిల్లా యంత్రాంగం నిర్వహించిన ఉగాది వేడుకల్లో రైతులు, కళాకారులను సత్కరించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో ఆదర్శ రైతులు ఆడమిల్లికి చెందిన మలకపల్లి వీర రాఘయ్య, కొయ్యలగూడెంకు చెందిన మద్దుకూరి కృష్ణ, దెందులూరు మండలం సీతంపేటకు చెందిన పర్వతనేని రామకృష్ణ, పెదవేగి మండలం లక్ష్మీపురానికి చెందిన ఆయి ల్‌పామ్ రైతు ఉప్పలపాటి చక్రపాటి, రాట్నాలకుంటలో కొబ్బరి, కోకో సాగుచేస్తున్న సింహాద్రి గోపాలకృష్ణ సత్కారం అందుకున్నారు. పౌరాణిక, సాంఘిక, సంగీతంగా యనీ గాయకులకు, పెయింటింగ్ రంగాల్లోని బొడ్డేపల్లి అప్పారావు, షేక్ మహబూబ్ సుభాని, వి.రామాంజనే యులు, పూనెం జయసాయి శ్రీను, టి.రమ్యకృష్ణ, వి.కల్యాణి, వి.కామరాజు, ఘంటసాల పెద్దిరాజు, యడవల్లి వెంకటరమణ, మాండవ రాజగోపాలకృష్ణ, బీకే.బిందు, కామ సోమరాజు, గండికోట రాజేష్, వాఖ్యాత, ఆర్టీసీ పీఆర్వో కెఎల్‌వీ నరసింహరావును సత్కరించారు.

● ఏలూరు కార్పొరేషన్ : నగరంలోని పలు డివిజన్లలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉగాది సందర్భంగా కుటుంబ సమేతంగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తపేటలోని నూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు మంత్రవాది రామకృష్ణ అర్చనలు జరిపారు. రామచంద్రరావు పేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, పవరుపేటలోని వాసుదేవాలయం వద్ద, అగ్రహా రంలోని జనార్దనస్వామి ఆలయం వద్ద, పడమర వీధిలోని శ్రీవారి ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయంలో ఉగాది సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మిత్ర బృందంతో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద, పాత శివాలయం వద్ద, పవరుపేటలోని కాశీ విశ్వేశ్వరాలయం వద్ద, సత్యనారాయణపేటలోని రేవులింగేశ్వరస్వామి ఆలయం వద్ద, బావిశెట్టివారిపేట, నాగేశ్వరపురంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఏలూరు రూరల్ : ఉగాదిని పురస్కరించుకుని ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది. రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో ప్రధాన కార్యదర్శి పుల్లాభోట్ల పురుషోత్తమరావు అధ్యక్షతన ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత విద్యా కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, పెదపాటి రామకృష్ణ, గరికపాటి కాళిదాసు, చప్పిడి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి పురస్కారాలను ప్రదానం చేశారు.శ్రీరామ్‌నగర్‌లోని తపన ఫౌండేషన్ కార్యాలయంలో గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, శ్రీకృష్ణ చరణానంద భారతిస్వామి, బీజెపి జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.విక్రమ్ కిశోర్, కె.కృష్ణప్రసాద్, జి.చైతన్య, నడపన దాన భాస్కర్ పాల్గొన్నారు. ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించగా పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు.

● నిడమర్రు మండలంలో నిడమర్రు, పెదనింద్రకొలను, చిననింద్రకొలను, మందలపర్రు, భువనపల్లి, అడవికొలను, ఛానమిల్లి దేవాలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిడమర్రు శ్రీబాలవెంకటేశ్వర స్వామిని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసు రాజు, చింతలపాటి బాసిరాజు పాల్గొన్నారు.

● పెదవేగి మండలం రాట్నాలకుంటలోని శ్రీరాట్నాలమ్మ ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి సతీశ్ కుమార్ మాట్లాడుతూ శ్రీరాట్నాలమ్మవారి తిరునాళ్ల వచ్చే నెల 12 నుంచి 16వ తేదీ బుధవారం వరకు ఐదు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

● మండల కేంద్రమైన ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

●ఏలూరుటూటౌన్ : ఏఎస్ఆర్ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే చంటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, ఎమ్మెల్యే చంటిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గవర్నర్ రామరాజు, ఆర్నేపల్లి మధు, అమరావతి అశోక్, ఆర్నేపల్లి తిరుపతిరావు, త్రిపర్ణ రాజేశ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విగ్నేశ్వరరావు, కార్యదర్శి మాధవరావు, కోశాధికారి నాగరాజు, డీ.మేరీమాణిక్యం, ఎం.రామ సత్యవతి, ఎస్.పద్మావతి, వీరభద్రరావు పాల్గొనగా ప్రవచన కర్త వేదాంతం విష్ణుప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు.

● బుట్టాయగూడెం గ్రామ దేవత గంగానమ్మను ఉగాది సందర్భంగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. వీరన్నపాలేనికి చెందిన గిరిజన దంపతులు బోడిక ప్రశాంత్, సంధ్యారాణి దంపతులు సంతానం కలగడంతో తమ కోర్కెను తీర్చిన రెడ్డిగణపవరంలోని శ్రీ కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామికి ఉగాదిని పురష్కరించుకుని సారెను సమర్పించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● పోలవరం : ఉగాది సందర్భంగా పోలవరం మండలంలో పలుచోట్ల ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడి, పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. పోలవరం పంచాయతీ జగన్నాథపేట సిద్ధి వినాయక ఆలయం వద్ద కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. పాత పోలవరం, వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, బస్ షెల్టర్ కనకదుర్గ ఆలయం, వెంకటాపురం ముత్యాలమ్మ ఆలయం, గుంజవరం ఉమాసహిత భోగలింగేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

● చింతలపూడి : వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. చింతలపూడికి చెందిన పండితుడు పుండరీకాక్షయ్య శర్మ పంచాంగాన్ని వినిపించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు లలితా పారాయణ జరిపారు. దుకాణాలు, గృహాలు మామిడి తోరణాలతో అలంకరించారు.


రాట్నాలకుంటలో రాట్నాలమ్మ ఉత్సవ పత్రిక ఆవిష్కరిస్తున్న కమిటీ

● కుక్కునూరు : ఉగాదిని పురస్కరించుకుని కుక్కునూరు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని అమ్మవార్లను మేళతాళాల మధ్య ఊరేగించారు. ప్రతీ ఇంటికి తీసుకొచ్చి అమ్మవారి పసుపు, కుంకుమలు అందజేశారు. ఈ క్రమంలో భక్తులు అమ్మవారి ప్రసాదాలు నైవేద్యాలు, నివేదించారు.

● లింగపాలెం : తెలుగు ప్రజలకు ముఖ్యమైన పండుగల్లో అతి ప్రాముఖ్యమైన పండుగ ఉగాది. ఈ పండుగను తెలుగువారంతా ఘనంగా జరుపుకుంటారు. ఉగాది సందర్భంగా మండలంలో అన్ని ఆలయాలలో ప్రత్యేకంగా జరిపారు. పలు ఆలయాల్లో ప్రధాన అర్చకులు ఉగాది పంచాంగ శ్రవణాన్ని భక్తులకు వినిపించారు. భక్తులు రెండో అన్నవరంగా భావించే రంగాపురం సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రత్యేక వ్రతాలు నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం : గురవాయి గూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో ఉగాది సందర్భంగా ఆదివారం ఆలయ అర్చకులచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో ఆర్.వి.చందన స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాలను కరాటం రాంబాబుకు అందచేశారు. ఈ పంచాంగ శ్రవణ కార్యక్రమంలో జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, టీడీపీ మం డలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు రావూరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, సర్పంచ్ సత్యవేణి పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : శివాలయం ఆవరణలో ఉగాది వేడుక పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. పండితులు టీఎస్.రామకృష్ణశర్మ పంచాగ శ్రవణం చేశారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, టీడీపీ జనసేన మండల పార్టీ అధ్యక్షులు సుంకవల్లి సాయి, పసుపులేటి రాము, ఆర్య వైశ్య సంఘం పెద్దలు కక్కిరాల సత్యం, కోరుకొండ జనార్ధన్, నాలి శ్రీను, ఎస్సై నవీన్ కుమార్ ఉన్నారు. వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో ఎవో టి.ఎస్. రవికుమార్ ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం జరిపారు.

● కొయ్యలగూడెం మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం సాయంత్రం మదనగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం జరిగింది.ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

● భీమడోలు మండలం భీమడోలు, గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో ఉగాది వేడుకలు నిర్వహించారు. భీమడోలులోని కాశీభొట్ల నాగవెంకటేశ్వర పార్వతీశ్వరశర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. భీమడోలు గ్రామంలోని ప్రముఖులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

బుట్టాయగూడెం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దొరమామిడిలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి అన్నంపెట్టే రైతులు పంటలకు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 1 నుంచి 7వ తేదీ వరకు మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రదర్శనలు, ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాస్, కారం రాఘవ, వి.వెంకటేశ్వరరావు, ముసలారెడ్డి, సద్గురు పాల్గొన్నారు.

చలివేంద్రం, జావ కేంద్రాల ప్రారంభం

ఏలూరు టూటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): సేవా తత్పరను నేర్పించిన మహోన్నత వ్యక్తి భగవాన్ సత్య సాయి అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మెయిన్ బజారులోని శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జావ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయి బాబా చూపిన మార్గంలో సేవా కార్యక్రమాలు కొనసాగించడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, ఏ.శశిశేఖరరావు, బి.రామారావు, అమరావతి అశోక్, ఆర్నేపల్లి తిరుపతి, త్రిపర్ణ రాజేశ్, కొట్టు మనోజ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు : అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ఇంకా విరివిగా నియోజకవర్గంలో చలివేంద్రాలు ప్రారంభించాలని దాతలకు పిలుపునిచ్చారు.


విశాఖలోని ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం వద్ద విద్యార్థులు, గైడ్ టీచర్లు

విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్ర విజయవంతం

ఏలూరు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలను జిల్లా విద్యాశాఖ ఎట్టకేలకు విజ్ఞాన, విహారయాత్రకు తీసుకెళ్లింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎంపికచేసిన 120 మంది విద్యార్థులతో విశాఖ వెళ్లిన బృందం యాత్ర ముగించుకుని ఆదివారం తెల్లవారు జామున నగరానికి చేరుకుంది. ఈ మేరకు జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు మీడియాతో మాట్లాడుతూ విజ్ఞాన యాత్ర విజయవంతంగా ముగిసిందన్నారు. కొద్దిరోజుల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల బాలబాలికలను జిల్లాలోని కె.ఆర్.పురంలోని చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీ ఫ్యాక్టరీకి తీసుకెళతామన్నారు. రాష్ట్రేతర టూర్‌లో భాగంగా హైదరాబాద్‌లోని విజ్ఞాన ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లాలని యోచిస్తున్నట్టు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సంక్షేమ బోర్డుపై మీనమేషాలు తగదు

ఏలూరు రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే దశల వారీ పోరాటం చేస్తామని హేలాపురి ప్రైవేటు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూ నియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం 15వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 45 లక్షలకుపైగా నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేస్తున్నారని, తక్షణం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డుపై ఆధారపడి అనేక కార్మిక కుటుంబాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావు, నగర గౌరవ అధ్యక్షుడు షైచర్ల శంకరరావు పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కార్యకర్తలే టీడీపీ బలం : చింతమనేని

పెదవేగి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల ఆదరాభిమానాలతోనే టీడీపీ 43ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రను కాపాడుకుంటూ వస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం రాయన్నపాలెంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ శనివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, మంచినేని శ్రీనివాసరావు, తాతా సత్యనారాయణ, మన్నే శ్రీనివాసరావు, పామర్తి నాగభూషణం, మన్నే భుజంగరావు, శొంఠి మురళీకృష్ణ, మానికొండ రాంబాబు, చలమాల సత్యనారాయణ, కూచిపూడి పుల్లారావు, గారపాటి రామసీత, మోరు శ్రావణి, పెనుబోయిన మహేష్, మేకా కనకరాజు, లావేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

పెదవేగి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : రామశింగవరంలోని కొండాలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెన్నవల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్పంచ్ అడపా శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం మాధవరావు, అడపా రాఘవ, పాపారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రామశింగవరంతో పాటు కూచింపూడి, న్యాయంపల్లి, పెదవేగి, బాదరాల, పోలాసి గూడెం, ఆసన్నగూడెం తదితర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. కమిటీ చైర్మన్ వెన్నవల్లి సత్యనా రాయణ మాట్లాడుతూ గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీకొండాలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు.

మూడు బస్సుల్లో అమరావతికి

ఉంగుటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఆదివారం సాయింత్రం ప్రారంభమైన మార్గదర్శి-బంగారు కుటుంబం(పి-4) కార్యక్రమానికి ఉంగుటూరు మండలం నుంచి మూడు బస్సుల్లో బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, వెలుగు, వ్యవసాయ శాఖలకు సంబంధించిన సిబ్బంది, డ్వాక్రా, అగ్రికల్చర్ అసిస్టెంట్లు తరలివెళ్లారు.

కొత్తపట్టిసీమలో మనిషి కాలు

పోలవరం, మార్చి30(ఆంధ్రజ్యోతి) : కొత్త పట్టిసీమ పంచాయతీ పరిధిలోని గోదావరి గట్టు సమీపంలో బహిరంగ ప్రదేశంలో మనిషి కాలు ప్రత్యక్షమవడంతో మండలంలో కలకలం రేగింది. చెప్పులు ప్యాంటుతో సహా కాలు నరికిన విధంగా పడి ఉండటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు.ఈ విషయంపై ఎస్ఐ పవన్ కుమార్‌ని వివరణ కోరగా ఎవరో ఆపరేషన్ ద్వారా తొలగించిన కాలుని కప్పెట్టకుండా పడేసి ఉంటారని, కాలుకి చుట్టిన బ్యాండేజీలు కట్లు ఆధారంగా విషయం స్పష్టమవుతోందన్నారు.

ప్రవేశ పరీక్ష గడువు పెంపు

చింతలపూడి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : ఏపీ గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్ష గడువు ఏప్రిల్ 6వ తేదీ వరకు పొడిగించినట్టు నాగిరెడ్డి గూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బ్రాహ్మణేశ్వరమ్మ తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

కోడి పందేలపై దాడి

టి.నర్సాపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కోడిపందేల శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్.ఐ. జయబాబు తెలిపారు. మధ్యాహ్నపువారి గూడెం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ.2300 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మర్రిపాడులో ఆరుగురి అరెస్టు..

కుక్కునూరు : మర్రిపాడులో ఆదివారం కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. వారి నుంచి 2500 నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. రామకృష్ణ తెలిపారు.

మూడు చోట్ల పోలీసుల దాడులు

ద్వారకాతిరుమల :మలసానికుంట, ఐ.ఎస్. జగన్నాథపురం గ్రామాల్లో జరిగిన కోడి పందేలపై పోలీసులు ఆదివారం దాడులు చేసి 19 మందిని అరెస్టు చేసి వారినుంచి రూ.49 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ టి.సుధీర్ తెలిపారు. మలసానికుంటలో జరిగిన దాడుల్లో పది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.33,400 నగదు, మూడు కోళ్లు, మూడు కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఐ.ఎస్.జగన్నాథపురంలో జరిగిన దాడుల్లో ఐ.ఎస్.రాఘవాపురానికి చెందిన విజ్జు నరసింహరావుతో పాటు మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.15,800 నగదు, కోడి, రెండు కత్తులు, మూడు బైక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మతంగూడెం, కొత్తపల్లి గ్రామాల్లో..

లింగపాలెం : మతంగూడెం, కొత్తపల్లి గ్రామాల్లో కోడిపందేలపై దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. మతంగూడెం, కొత్తపల్లి గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై దాడులు చేసి వారి నుంచి 4500 నగదు చేసి నాలుగు కోళ్లు, మూడు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆసన్నగూడెంలో పేకాట స్థావరంపై దాడిచేసి 5వేల నగదు ఐదుగురిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడులు

పెదవేగి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : కూచింపూడిలో పేకాడుతున్నారని సమాచారంతో దాడిచేసి, ముగ్గురిని అరెస్టు చేశామని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.9077ల నగదును స్వాధీనం చేసుకున్నామని, జూదరులను కోర్టులో హాజరు పరుస్తామని ఆయన చెప్పారు.

శ్రీవారి దర్శనం

భీమడోలు, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ విజయం కోసం కష్టపడిన భీమడోలు మండలం పాతూరు జనసైనికులు ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విజయాలు సాధిస్తే దర్శించుకుంటామని మొక్కుకున్నారు. ఈ మేరకు పాదయాత్రగా తరలివెళ్లి మొక్కు చెల్లించుకున్నారు.. స్వామికి మొక్కు చెల్లించుకున్న వారిలో నాయకులు వెజ్జు రాంబాబు, పాపారాయుడు, శ్రీనివాసరావు, పవన్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో ఏరువాక



కలిదిండి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా కోరుకొల్లులో ఆదివారం రైతులు ఏరువాక నిర్వహించారు. ఎద్దుల నాగలితో పంట పొలాలను దుక్కి దున్నుతున్నారు. ప్రతి ఉగాది రోజున ఏరువాక నిర్వహిస్తారు. ఎద్దుల నాగలితో పంట పొలాలను దుక్కిదున్నుతారు. కార్యక్రమంలో డీసీ ఛైర్మన్ పేటేటి సత్యనారాయణ, కేశిరెడ్డి శ్రీరామకృష్ణ, మాజీ ఎంపీపీ చెన్నంశెట్టి మురళీకృష్ణ, మాజీ ఆత్మ ఛైర్మన్ చెన్నంశెట్టి శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు తోట రాముడు తదితరులు పాల్గొన్నారు.

అమర్‌భవన్‌లో కవి సమ్మేళనం

నూజివీడు, మార్చి30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అభ్యుదయ రచయితల సంఘం(అరసం)ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. చలసాని వెంకటరామారావు ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు.కవులు సాఖా ఆకాశ్, ఎస్‌కేడీ ప్రసాద్, ఎస్‌టీపీ ఆచార్యులు, మోహన్‌రావు, జుజ్జువరపు రంగారావు, బండి రుక్మిణీప్రసన్నలు భావకవిత్వాలతో ఆకట్టుకున్నారు. అనంతరం సత్యసాయి విద్యాలయం, రామకృష్ణ సేవాసమితి చిన్నారులు చేసిన లఘునాటికలు ఆలోచింపజేయగా గుంటూరుకృష్ణ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. ఉగాదిని పురస్కరించుకుని ఆర్‌ఎస్‌ఆర్ స్మారక పురస్కారాన్ని నూజివీడుకు చెందిన దారా మోహన్‌రావుకు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌సభ్యులు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళాలు



ముదినేపల్లిలో మాట్లాడుతున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

ముదినేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి 'అమరావతికి జీవం పోద్దాం' అనే కార్యక్రమానికి కార్యాచరణ ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణానికి బ్రాండ్ అంబాసిడర్‌గా తనవంతు సహకారం అందించేందుకు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు తన తండ్రి డాక్టర్ మనోజ్‌తో కలసి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆమె ఎకరంన్నర పొలం, తన బంగారం అమ్మి రాజధాని, పోలవరం నిర్మాణానికి సుమారు రూ.60 లక్షలు విరాళం ఇచ్చిన వైష్ణవి ఇప్పుడు ప్రతి వ్యక్తిని అమరావతి అభివృద్ధిలో భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో విరాళాలు సేకరించాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విషయాన్ని ఆదివారం ఆమె ముదినేపల్లిలో వెల్లడించారు. ప్రతి వ్యక్తి కనీసం రూ.116 విరాళం ఇవ్వాలని కోరతానన్నారు.



వడాలిలో నిర్మించిన సీసీ రోడ్డు

నేడు గ్రామాల్లో సీసీ రోడ్ల ప్రారంభం

ముదినేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సోమవారం ముదినేపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. సుమారు రూ.కోటి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభిస్తారు. చిగురుకోట, చినకామనపూడి, పెదకామనపూడి, వడాలి గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. అనంతరం ముదినేపల్లిలో ఎకె స్పెషాలిటీ క్లీనిక్ అండ్ డయోగ్నస్టిక్ ఆధ్వర్యంలో జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు.



చలివేంద్రం ప్రారంభం

చాట్రాయి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహారావుపాలెంలో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని ఆదివారం వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంతి, ఉప సర్పంచ్ రఘుపతిరెడ్డి, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష గడువు పెంపు

చింతలపూడి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : ఏపీ గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్ష గడువు ఏప్రిల్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బ్రాహ్మణేశ్వరమ్మ తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ



కలిదిండి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిని త్వరితగతిన ఛేదించాలని కోరుతూ క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు, క్రైస్తవులు ఆదివారం సాయంత్రం కలిదిండిలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు పి.శాంతి వర్ధన్, జాన్ మంగాచార్యులు, యోహోన, డి.సామ్యూల్ రాజ్, బోడిగడ్డ కిషోర్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

జైలులో మహిళా రిమాండ్ ఖైదీ ఆత్మహత్య



ఫైల్

ఏలూరు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడితో కలిసి భర్తను హత్య చేశారనే ఆరోపణపై అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా జిల్లా జైలులో ఉన్న ఒక మహిళ తాను ఉన్న బ్యారెక్ కిటికీకి చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ సంఘటన జిల్లా కేంద్రమైన ఏలూరులో తీవ్ర కలకలం కలిగించింది. పోలీసులు, మృతు రాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలం తాటి ఆకులగూడేనికి చెందిన గంధం శాంతకుమారి (31)కి భర్త బోసు, కుమార్తె ఆరాధ్య (10), కుమారుడు అనూప్ శక్తి అలియాస్ చర్రీ (12) ఉన్నారు. శాంతకుమారి తన ప్రియుడు సొంగా గోపాలరావుతో కలిసి భర్తను హతమార్చారనే ఆరోపణపై మార్చి 24వ తేదీన అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా ఏలూరు జిల్లా జైలులో ఉంటున్నది. మహిళా బ్యారక్‌లో ఉంటున్న శాంతకుమారి ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో అందరూ టిఫిన్ చేయడానికి బయటకు వచ్చారు. బయటకు వచ్చిన శాంతకుమారి తిరిగి వాష్‌రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి బ్యారక్ వద్దకు వెళ్లిపోయింది. అక్కడ ఉన్న డ్యూటీ మహిళా కానిస్టేబుల్ 7.50 నిముషాలకు వెళ్ళి చూసేటప్పటికి బ్యారక్ కిటికి తన చున్నీతో ఉరి వేసుకుని వేలాడబడుతూ కనిపించింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు ధృవీ కరించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జైలు సూపరింటెండెంట్ స్వామి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఈ సంఘటనపై ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్య నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఏలూరు తహసిల్దార్ శేషగిరి జిల్లా జైలును పరిశీలిం చారు. ప్రభుత్వాసుపత్రి వద్దకు వచ్చి మృత దేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి, బంధువులతో ఆర్డీవో మాట్లాడారు. సోమవారం ఉదయం శాంత కుమారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

హెడ్ వార్డర్, వార్డర్ సస్పెన్షన్

జిల్లా జైలులో విధి నిర్వహణలో ఉన్న హెడ్‌వార్డర్ ఎల్.వరలక్ష్మి, వార్డర్ నాగమణిలు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడంతోనే రిమాండ్ ఖైదీ శాంతకుమారి ఉరి వేసుకోవ డానికి ఆస్కారం ఏర్పడిందని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిద్దరిని విధుల్లో నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి ఆది వారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లలకు న్యాయం చేయండి

తన అల్లుడు బోసు, కుమార్తె శాంతకుమారి చిన్నచిన్న గొడవలు పడేవారని తన కూతురు అమాయకురాలని తన అల్లుడిని చంపేంత ధైర్యం తన కుమార్తెకు లేదని అన్యాయంగా కేసులో ఇరికించారన్నారు.తన కుమార్తెకు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారిద్దరికి న్యాయం చేయాలని ఆమె కోరారు. శాంతకుమారిని అక్రమంగా కేసులో ఇరికించారని జీలుగుమిల్లి పోలీసుల వేధింపుల భరించలేక ఆమె అవమాన పడి ఆత్మహత్యకు పాల్పడిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు కందుల రమేష్ అన్నారు.

నేడు ముదినేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ముదినేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లిలోని ఏకే స్పెషాల్టీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డులోని ఈ ఆసుపత్రి వద్ద నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు ఓపీ ఉచితంగా చూస్తారు. కిడ్నీ, థైరాయిడ్, ఈసీజీ పరీక్షలకు అతి తక్కువ చార్జీలతో పరీక్షలు నిర్వహిస్తారని ఆసుపత్రి డాక్టర్ కళాసాగర్ తెలిపారు. ముదినేపల్లి ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.







ముసునూరులో అలంకరణలో వెంకటాచల స్వామి.. కైకలూరు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు... సింగరాయపాలెంలో పంచాంగ శ్రవణం

ఇంటింటా ఉగాది

ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. పంచాంగ శ్రవణాలు

చాట్రాయి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. లోగిళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. అభ్యంగన స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి పరస్పరం తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆడపడుచులు అల్లుళ్లతో లోగిళ్ల కళకళలాడాయి. షడ్రుచుల ఉగాది పచ్చడి, పరమాన్నం, బూరెలు పులిహోర తయారు చేసి దేవునికి నైవేద్యంగా సమర్పించి, కుటుంబ సభ్యులు బంధు మిత్రులకు పంపిణీ చేశారు. దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. వైష్ణవ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అనంతరం కుటుంబ సభ్యులు అందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

కలిదిండి: మండలంలో ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో వేదపండితులు ఎం.శేషగిరి శర్మ, మురళీ కృష్ణమాచార్యులు, కొమాండూరి వరద రాజ స్వామిల ఆధ్వర్యంలో పంచాంగ పఠనం, వేదపఠనం నిర్వహించారు. పలు వైజ్ఞానిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కలిదిండి వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెదలంక రామాలయంలో పూజలు, భజనలు నిర్వహించి వేపపువ్వు పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ రహదారిలో ఉన్న వరసిద్ధి వినాయక స్వామి విగ్రహం వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

మండవల్లి: మండలంలో ఉగాది పర్వదినం సందర్భంగా పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండవల్లిలోని శ్రీభ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి, పుట్లచెరువులో శ్రీకాశీవిశాలక్షి సమేత విశ్వేశ్వరస్వామి, లింగాల, అయ్యవారి రుద్రవరం, అప్పాపురం, భైరవపట్నం గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మండవల్లిలోని శ్రీవిజయదుర్గ అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

ముదినేపల్లి: ఉగాది వేడుకలు ముదినేపల్లి మండలంలో ఆదివారం సాంప్రదాయబద్ధంగా జరిగాయి. దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో సింగరాయపాలెం - చెవూరిపాలెం సెంటర్ లోని వల్లీ దేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో అర్చకులు ఆసూరి రంగనాధాచార్యులు, కోట శివశంకర శర్మ, రుద్రపాక బాలగంగాధర్ తిలక్, తేలేటి వీరభద్రశర్మ తదితరులు పంచాగ శ్రవణం చేశారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బి రవికుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వడాలిలోని శ్రీసుభద్ర బలరామసహిత శ్రీ జగన్నాధస్వామి ఆలయంలో కార్యనిర్వహణాధికారి సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ నాయకులు పి.పాండురంగారావు, చలసాని జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. గురజ గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లోను, ముదినేపల్లిలోని పెదరామాలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమాలు జరిగాయి.

ముసునూరు: ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు సంప్రదాయంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంట షడ్రుచులతో పచ్చడి తయారు చేసుకుని, కుటుంబ సమేతంగా స్వీకరించారు. ముసునూరులో వెంకటాచల స్వామి ఆలయం, గోగులంపాడు, చెక్కపల్లి, రమణక్కపేట, గోపవరం తదితర గ్రామాల్లో ఉన్న కోదాండ రామాలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు సుభిక్షించగా పండుతాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని, రాష్ట్రంలో అభివృద్ధిలో ముందుకు వెళుతుందిని పండితులు వివరించారు.

నూజివీడు టౌన్: తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది వేడుకలు నూజివీడు పట్టణ, మండల ప్రాంతాలలో వైభవంగా జరిగాయి. పలు దేవాలయాలలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కోదండ రామాలయంలో కోట శివ, నూజివీడు వెంకటాచలస్వామి దేవస్థానంలో వేదాంతం గోపాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక అలంకరణ అభిషేకాలు నిర్వహించారు.



చాట్రాయిలో హనుమాన్‌కు పూజలు

కైకలూరు: కైకలూరు మండలంలో పండుగకు సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్యామలాంబ అమ్మవారు, కైకలూరు కోరుకొల్లురోడ్డులో ఉన్న దాసాంజనేయస్వామి, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ, మీసాల వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పెద్దఎత్తున పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందించారు.

కైకలూరు విద్యాంజలి కళాశాలలో సాహితి మిత్రుల ఆధ్వర్యంలో ఉగాదిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ యార్లగడ్డ బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ పాల్గొని ఉగాది పండుగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం శ్రీరామ శతకం గ్రంధ ఆవిష్కరణ, కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పురస్కారాలను విద్యావేత్త సయ్యద్ జమీల్ అహ్మద్, వర్ధమాన కవి దండే బెనర్జీ, ప్రముఖ రచయిత రుద్రపాక సామ్రాజ్యలక్ష్మీకి అందజేశారు. కార్యక్రమంలో సాహిమిత్రుల అధ్యక్షులు తుమ్మలపల్లి బాలకృష్ణరావు, ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకటనారాయణ పాల్గొన్నారు.



కోట దుర్గమ్మ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గురజలో కోట దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ముదినేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం గురజ గ్రామంలోని అల్లూరు సీతారామరాజు కాలనీలో కోట దుర్గమ్మ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దాతల విరాళాలతో నిర్మించిన ఈ నూతన ఆలయంలో సోమవారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠ జరుగనుంది. ఈ సందర్భంగా యాజ్ఞీకులు సుసర్ల సత్యనారాయణమూర్తి, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు చేడిక వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన హోమాలు, పూజాది కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 31న ప్రతిష్ఠోత్సవం అనంతరం అన్నసమారాధన, ఏప్రిల్ 1న పూజలు, అభిషేకాలు, 2న అమ్మవారి జాతర నిర్వహిస్తారు.

కార్మికులకు అండగా వార్డు సభ్యులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కైకలూరు వార్డు సభ్యులు

కైకలూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కైకలూరు గ్రామపంచాయతీ కాంట్రాక్ట్ సిబ్బంది పాతవారినే కొనసాగించాలని అందుకు వారికి పూర్తి సహాయసహకారాలను వార్డుసభ్యులందరం కలిసి అందిస్తామని సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం కైకలూరులో విలేకర్ల సమావేశంలో 9మంది వార్డు సభ్యులు కార్మికులకు అండగా ఉంటున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో వారి ప్రాణాలను లెక్కజేయకుండా ప్రజలకు ఎన్నో సేవలను అందించారని అలాంటి వారిపై కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి కక్షపూరితంగా వ్యవహరిస్తూ వారిని తప్పించేందుకు ఎలాంటి అనుభవం లేని ఏజెన్సీల ద్వారా తక్కువ ధరలకే టెండర్లు వేయించారని పేర్కొన్నారు. నాలుగు నెలలుగా సర్పంచ్ చెక్ పవర్ రద్దు అయినప్పటి నుంచి వీరిపట్ల వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వార్డుసభ్యులతోనూ పంచాయతీలో పనిచేసే అధికారులతోను సమన్వయం చేసుకొని పరిపాలన చేయకుండా సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలతో గ్రామాభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. పంచాయతీ కాంట్రాక్ట్ సిబ్బంది ఎమ్మెల్యే కామినేని శ్రీనివా స్‌కు మొరపెట్టుకునేందుకు క్యాంపు కార్యాలయానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవ డంతో వారి పీఏకు జరిగిన టెండర్ ప్రక్రియ విధానాన్ని వివరించారన్నారు. సమావేశంలో కేవీఎస్‌ఎం నాయుడు, పిచుకల శివరమ్య, పిచ్చుకల సుధారాణి, బెల్లాని శ్యామలరావు, సమతం శ్రీనివాసరావు, తోట మహేశ్, బిరుదు గడ్డ రాజమణి, అమ్మన్నా కౌర్, జ్యోతి, మేడూరి నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబూరావుకు అంబేడ్కర్ ఉగాది పురస్కారం



బాబూరావుకు అంబేడ్కర్ ఉగాది పురస్కారం అందజేస్తున్న చెన్నకేశవులు

ముదినేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, ముదినేపల్లికి చెందిన సేవా నాగ జగన్ బాబూరావుకు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఉగాది సందర్భంగా ఆదివారం ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలో జరిగిన వేడుకల్లో బాబూరావుకు ఈ అవార్డును రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు అందజేశారు.



స్వామివారి కల్యాణానికి పసుపు కొడుతున్న ధర్మకర్త దంపతులు

చనుబండ రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు

చాట్రాయి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అపరభద్రాద్రి చనుబండ కోదండరామ స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం నాడు స్వామివారి కల్యాణానికి పెళ్లి పనులు ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు, ఆలయ పూజారి మారుతీ దంపతులు పలువురు గ్రామ ప్రముఖులు, భక్తులు ఆదివారం పసుపు కొట్టి పెండ్లి పనులు ప్రారంభించారు. అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడిగా వేద పండితులు ముస్తాబు చేశారు. తరువాత జైశ్రీరామ్ నామాన్ని జపిస్తూ మహిళలు, కల్యాణ భక్తులు తలంబ్రాలు కలిపారు.

2న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ముసునూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీన కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 9గంటల నుంచి బీసీ, ఈబీసీ, వైశ్య, కమ్మ, కాపు కార్పొరేషన్ లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తుదారులు రుణం కోసం పెట్టిన దరఖాస్తు, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకాన్ని తీసుకుని, సకాలంలో హాజరుకావాలని కోరారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ముదినేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం గురజ, కొర్రగుంట పాలెం గ్రామాల్లో ఆదివారం కోడిపందేలపై ఎస్‌ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించి 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7250 నగదు, మూడు కోడి పుంజులు, ఒక కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి





కైకలూరులో ఆందోళన చేస్తున్న కోరుకొల్లు గ్రామస్థులు (ఇన్‌సెట్‌లో) సత్యనారాయణ (ఫైల్)

కలిదిండి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోరుకొల్లుకు చెందిన బుసనబోయిన సత్యనారాయణ (47) శనివారం రాత్రి కలిదిండి నుంచి కోరుకొల్లు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా, సానారుద్రవరంలో మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించటంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పండుగ పూట సత్యనారాయణ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన

కైకలూరు: కైకలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద జాతీయ రహదారిపై మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. కైకలూరు ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. అయితే మృతుడు కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడని, కుటుంబానికి ఆధారం కోల్పోయాడని న్యాయం చేయాలంటూ కైకలూరులో జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. కైకలూరుటౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్‌ఐ వెంకట్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని ఢీకొట్టిన వారిపై కేసు నమోదు చేస్తామని సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475